# భారత్ ప్రత్యర్థి ఎవరు?

**నేడు న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా రెండో సెమీస్**



లాహోర్: ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో ఫైనల్ చేరిన భారత జట్టు ప్రత్యర్థి ఎవరో బుధవారం తేలనుంది. లాహోర్ వేదికగా జరుగబోయే రెండో సెమీస్‌లో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా తలపడనున్నాయి. ఐసీసీ టోర్నీలలో ఇప్పుడిప్పుడే 'చోకర్స్' అన్న ముద్రను తొలిగించుకుంటున్న దక్షిణాఫ్రికా.. నిలకడగా ఆడే న్యూజిలాండ్‌తో కీలక పోరులో ఎలా ఆడుతుందన్నది ఆసక్తికరం. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో ఇరు జట్లు సమంగా ఉండటంతో సెమీస్ పోరు రసవత్తరంగా సాగడం ఖాయం. అయితే వరుసగా గాయాలతో సతమతమవుతున్న సఫారీలకు తాజాగా మార్క్‌రమ్ గాయం వేధిస్తోంది. కివీస్‌తో మ్యాచ్‌లో అతడు ఆడతాడా? లేదా? అన్నది మ్యాచ్ సమయానికి తేలనుంది.

# ఫ్యామిలీలకు నో ఎంట్రీ!

- **ఐపీఎల్-18లో కొత్త నిబంధనలు**

ముంబై: మరో మూడు వారాల్లో మొదలుకాబోయే ఐపీఎల్- 2025 సీజన్‌కు ముందు ఆటగాళ్ల ప్రయాణ, కుటుంబ సభ్యుల విషయంలో బీసీసీఐ కొత్త నిబంధనలు విధించింది. 'ఆటగాళ్లు ప్రాక్టీస్ సందర్భంగా టీమ్ బస్సుల్లోనే ప్రయాణించాలి. ప్రయాణాల్లో రెండు బ్యాచ్‌లుగా వెళ్లొచ్చు. ప్రాక్టీస్ సమయంలో సరైన గుర్తింపు (అక్రిడిటేషన్) ఉన్న సిబ్బందికి మాత్రమే డ్రెస్సింగ్ రూమ్‌లోకి అనుమతి ఉంటుంది. ఆటగాళ్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు ఇతర బస్సుల్లోనే ప్రయాణించాలి. వాళ్లు టీమ్ ప్రాక్టీస్‌ను స్టాండ్స్ నుంచి మాత్రమే వీక్షించాలి. జట్ల సహాయ సిబ్బంది (త్రో డౌన్ స్పెషలిస్టులు, నెట్ బౌలర్లు) బీసీసీఐ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి' అని ఫ్రాంచైజీలకు లేఖలు రాసినట్టు బోర్డు ప్రతినిధి ఒకరు తెలిపారు.

# బాబర్, రిజ్వాన్‌పై వేటు

**కివీస్ టూర్‌కు పాకిస్థాన్ టీ20 జట్టులో భారీ మార్పులు**



లాహోర్: స్వదేశంలో జరుగుతున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో ఘోరంగా విఫలమై లీగ్ దశలో ఒక్క మ్యాచ్ కూడా గెలవకుండానే నిష్క్రమించిన పాక్ జట్టులో భారీ మార్పులకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) శ్రీకారం చుట్టింది. ఈనెల 16 నుంచి న్యూజిలాండ్‌తో జరుగబోయే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు గాను ఆ జట్టు సారథి మహ్మద్ రిజ్వాన్‌తో పాటు స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్‌పై వేటు వేసింది. గత కొంతకాలంగా పొట్టి ఫార్మాట్‌లో ఈ ఇద్దరూ మరీ నెమ్మదిగా ఆడుతూ తీవ్రస్థాయిలో విమర్శలెదుర్కొంటున్నారు. చాంపియన్స్ ట్రోఫీలోనూ ఆడిన రెండు మ్యాచ్‌లలో అదే ఆటతీరుతో విఫలమైన నేపథ్యంలో పీసీబీ కఠిన చర్యలకు ఉపక్రమించింది. రిజ్వాన్‌ను టీ20ల నుంచి తప్పించిన పీసీబీ.. యువ బ్యాటింగ్ ఆల్‌రౌండర్ సల్మాన్ అలీ అఘాకు సారథ్య బాధ్యతలు అప్పగించింది. చాలాకాలం తర్వాత షాదాబ్ ఖాన్ జట్టులోకి రాగా అతడికి వైస్ కెప్టెన్సీ దక్కింది. అయితే టీ20లలో స్థానం దక్కించుకోలేకపోయినా వన్డేలలో మాత్రం రిజ్వాన్, బాబర్ తమ స్థానాలను నిలుపుకున్నారు. కానీ స్టార్ పేసర్లు హరీస్ రౌఫ్, షహీన్ షా అఫ్రిది వన్డే జట్టుకు ఎంపిక కాలేదు. హెడ్ కోచ్ అకీబ్ జావేద్‌పై వేటు పడుతుందని ఊహాగానాలు వినిపించినా పీసీబీ మాత్రం అతడిని కొనసాగించింది.

# కంగారూలను కొట్టేసి



కోహ్లీ (84)

**సెమీస్‌లో భారత్ చేతిలో చిత్తయిన ఆస్ట్రేలియా • చాంపియన్స్ ట్రోఫీలో వరుసగా మూడోసారి ఫైనల్‌కు టీమ్ఇండియా**

**కీలక పోరులో కోహ్లీ విజృంభణ • రాణించిన శ్రేయాస్, రాహుల్ • స్మిత్, కేరీ పోరాటం వృథా**

**ఏడాదిన్నర క్రితం కోట్లాది మంది భారత క్రికెట్ అభిమానులకు అంతులేని ఆవేదనను మిగిల్చిన కంగారూలపై రోహిత్ సేన కసితీరా ప్రతీకారం తీర్చుకుంది. 2023 డబ్ల్యూటీసీ ఫైనల్‌తో పాటు ఇటీవల ముగిసిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో పరాభవాలకు బదులు తీర్చుకుంటూ ఆసీస్‌ను సెమీస్‌లో మట్టికరిపించింది. బౌలింగ్‌లో స్మిత్ సేనను మోస్తరు స్కోరుకే కట్టడిచేసిన టీమ్ఇండియా.. ఛేదనలో మొనగాడు విరాట్ కోహ్లీ, ఐసీసీ టోర్నీలలో నిలకడగా ఆడే శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్ మెరవడంతో చాంపియన్స్ ట్రోఫీలో వరుసగా మూడోసారి ఫైనల్‌కు చేరుకుంది. కోహ్లీ మరోసారి కళాత్మక ఇన్నింగ్స్‌తో కంగారూలను కంగారెత్తించాడు. తక్కువ స్కోరును కాపాడుకునేందుకు ఆసీస్ కడదాకా పోరాడినా ఆ జట్టుకు పరాభవం తప్పలేదు.**

దుబాయ్: బదులు తీరింది! గత రెండు ఐసీసీ టోర్నీలలో భారత కప్పు ఆశలపై నీళ్లు చల్లిన వరల్డ్ చాంపియన్స్ ఆస్ట్రేలియాపై భారత జట్టు ప్రతీకారం తీర్చుకుంది. చాంపియన్స్ ట్రోఫీ తొలి సెమీస్‌లో భాగంగా దుబాయ్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన పోరులో భారత్ 4 వికెట్ల తేడాతో నెగ్గి ఫైనల్‌కు చేరుకుంది. కంగారూలు నిర్దేశించిన 265 పరుగుల ఛేదనను రోహిత్ సేన 48.1 ఓవర్లలో పూర్తిచేసి ఈ టోర్నీలో వరుసగా మూడోసారి ఫైనల్ చేరింది. ఛేదనలో మొనగాడు విరాట్ కోహ్లీ (98 బంతుల్లో 84, 5 ఫోర్లు) మరో చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో మెరవగా శ్రేయాస్ అయ్యర్ (62 బంతుల్లో 45, 3 ఫోర్లు), కేఎల్ రాహుల్ (34 బంతుల్లో 42 నాటౌట్, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. మొదట బ్యాటింగ్ చేసిన ఆసీస్ తరఫున సారథి స్టీవ్ స్మిత్ (96 బంతుల్లో 73, 4 ఫోర్లు, 1 సిక్స్), అలెక్స్ కేరీ (57 బంతుల్లో 61, 8 ఫోర్లు, 1 సిక్స్) ఆదుకోవడంతో ఆ జట్టు పోరాడగలిగే స్కోరును సాధించింది. భారత బౌలర్లలో షమీ (3/48), జడేజా (2/40), వరుణ్ (2/49), అక్షర్ (1/43) ఆసీస్‌ను కట్టడి చేశారు. కోహ్లీకి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా మధ్య బుధవారం జరుగబోయే రెండో సెమీస్ విజేతతో భారత్ ఈనెల 9న టైటిల్ పోరులో తలపడనుంది.



షమీ (3/48)

### నిలబడ్డ కోహ్లీ, శ్రేయాస్

మోస్తరు ఛేదనలో రోహిత్ (28), గిల్ (8) త్వరగానే నిష్క్రమించినా కోహ్లీ, శ్రేయాస్ నిలబడ్డారు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు 91 పరుగులు జోడించి భారత విజయంలో కీలకపాత్ర పోషించారు. పాక్‌తో మ్యాచ్‌లో మాదిరిగానే కోహ్లీ.. మరో చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. మ్యాచ్ మ్యాచ్‌కూ భిన్నంగా స్పందిస్తున్న పిచ్‌పై కోహ్లీ, శ్రేయాస్ తమ అనుభవన్నంతా రంగరించి కంగారూలకు ఏమాత్రం అవకాశమివ్వకుండా ఆడారు. రోహిత్ 7, 15 పరుగుల వద్ద కనోలి, లబూషేన్ క్యాచ్‌లు జారవిడిచినా దానిని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఫామ్‌లో ఉన్న గిల్‌ను డ్వార్షుయిస్ ఐదో ఓవర్లో క్లీన్‌బౌల్డ్ చేయగా కనోలి 8వ ఓవర్లో రోహిత్ లెగ్‌బిఫోర్‌గా నిష్క్రమించాడు. ఈ క్రమంలో కోహ్లీ, శ్రేయాస్ ద్వయం వికెట్ల పతనాన్ని అడ్డుకుంది. కనోలి 10వ ఓవర్లో రెండు బౌండరీలు బాదిన శ్రేయాస్.. జంపా, సంఘా, మ్యాక్స్‌వెల్‌ను సమర్థంగా ఎదుర్కొని పరుగులు రాబట్టాడు. మరో ఎండ్‌లో కోహ్లీ కూడా స్ట్రైక్ రొటేట్ చేస్తూ రన్ రేట్ పడిపోకుండా జాగ్రత్తపడ్డాడు. జంపా 25వ ఓవర్లో బౌండరీతో తన కెరీర్‌లో 74వ అర్ధ సెంచరీ పూర్తియింది. కానీ జంపా వేసిన 27వ ఓవర్లో శ్రేయాస్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. అక్షర్ (27) ఓ భారీ సిక్స్, ఫోర్‌తో వేగంగా ఆడేందుకు యత్నించాడు. కానీ ఎల్లీస్ 35వ ఓవర్లో ఇన్‌సైడ్ ఎడ్జ్‌తో బౌల్డ్ అయ్యాడు. కోహ్లీ, అక్షర్ నాలుగో వికెట్‌కు 44 పరుగులు జోడించారు. 39వ ఓవర్లో 200 పరుగులు మార్కును దాటి లక్ష్యం దిశగా సాగుతున్న భారత్‌ను జంపా మరోసారి దెబ్బకొట్టాడు. అతడి 43వ ఓవర్లో కోహ్లీ.. లాంగాన్ వద్ద డ్వార్షుయిస్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. కానీ అప్పటికే క్రీజులో నిలదొక్కుకున్న రాహుల్.. హార్దిక్(28), జడేజా(2 నాటౌట్) అండతో లాంఛనాన్ని పూర్తిచేశాడు.

### స్మిత్, కేరీ పోరాటం

బౌలింగ్ బలహీనంగా ఉన్నప్పటికీ పటిష్టమైన బ్యాటింగ్ లైనప్ ఉన్న ఆస్ట్రేలియా.. భారత స్పిన్నర్ల ధాటికి తలొగ్గక తప్పలేదు. షమీ తన రెండో ఓవర్లోనే ఓపెనర్ కనోలిని డకౌట్ చేసి భారత్‌కు తొలి బ్రేక్ ఇచ్చాడు. టీమ్ఇండియాకు కొరకరాని కొయ్య అయిన హెడ్ (39) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. వరుణ్.. తాను వేసిన తొలి ఓవర్ (ఇన్నింగ్స్ 9వ)లో రెండో బంతికే హెడ్‌ను ఔట్ చేయడంతో మెన్ ఇన్ బ్లూ ఊపిరి పీల్చుకుంది. అయితే స్మిత్.. క్రీజులో అడ్డుగోడలా నిలబడ్డాడు. మొదట హెడ్‌తో ఆ తర్వాత లబూషేన్ (29), కేరీతో అతడు కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. స్మిత్, లబూషేన్ ద్వయాన్ని విడదీయడానికి రోహిత్.. అక్షర్, జడేజా, వరుణ్‌తో నిరాటంకంగా దాడి చేయించాడు. ఎట్టకేలకు జడేజా 23వ ఓవర్లో లబూషేన్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకుని పార్ట్‌నర్‌షిప్ బ్రేక్ చేశాడు. అదే ఊపులో జడ్డూ.. ఇంగ్లిస్ (11)నూ వెనక్కిపంపాడు. కానీ స్మిత్‌కు జతకలిసిన కేరీ భారత స్పిన్నర్లపై ఎదురుదాడికి దిగాడు. 69 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్న స్మిత్.. ఐసీసీ నాకౌట్‌లలో తానెంత విలువైన ఆటగాడో మరోసారి నిరూపించుకున్నాడు. మరో ఎండ్‌లో కేరీ.. వరుణ్ బౌలింగ్‌లో భారీ సిక్సర్ బాదడమే గాక కుల్‌దీప్, హార్దిక్ ఓవర్లలో రెండేసి బౌండరీలు రాబట్టాడు. స్కోరును పెంచే క్రమంలో స్మిత్.. షమీ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అవడంతో మ్యాచ్‌పై మళ్లీ భారత్ పట్టుబిగించింది. మ్యాక్స్‌వెల్ (7)ను అక్షర్ అద్భుత బంతితో బోల్తా కొట్టించాడు.

**7** ఐసీసీ నిర్వహించే అన్ని టోర్నీలలో జట్టును ఫైనల్ చేర్చిన తొలి సారథి రోహిత్. అతడి సారథ్యంలో భారత్ డబ్ల్యూటీసీ చాంపియన్‌షిప్ (2023), వన్డే ప్రపంచకప్ (2023), టీ20 వరల్డ్ కప్ (2024), చాంపియన్స్ ట్రోఫీ (2025)లో ఫైనల్ చేరింది.

> ఆస్ట్రేలియాపై అద్భుత విజయం సాధించిన టీమ్ఇండియాకు అభినందనలు. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్. టైటిల్ పోరులో టీమ్ఇండియాకు బెస్టాఫ్ లక్. మరొక్క అడుగుతో కప్‌ను తిరిగి దేశానికి తీసుకురండి. అద్భుతమైన ఆటతీరు, సంకల్పం కనబరిచిన కోహ్లీ ఇన్నింగ్స్ చిరస్మరణీయం.
> – హరీశ్‌రావు, మాజీ మంత్రి

### సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా: 49.3 ఓవర్లలో 264 ఆలౌట్ (స్మిత్ 73, కేరీ 61, షమీ 3/48, జడేజా 2/40); భారత్: 48.1 ఓవర్లలో 267/6 (కోహ్లీ 84, శ్రేయాస్ 45, జంపా 2/60, కనోలి 1/37)

**2** **అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక క్యాచ్‌లు పట్టిన ఆటగాళ్లలో కోహ్లీ (161).. పాంటింగ్ (160)ను అధిగమించాడు. ఈ జాబితాలో జయవర్దనె(218) తర్వాత కోహ్లీ రెండో స్థానంలో ఉన్నాడు.**

### శివాల్కర్ మృతికి సంతాపంగా..

దేశవాళీ క్రికెట్ దిగ్గజం పద్మాకర్ శివాల్కర్(84) మృతికి సంతాప సూచకంగా ఆస్ట్రేలియాతో సెమీస్ మ్యాచ్ సందర్భంగా టీమ్ఇండియా క్రికెటర్లు నల్లని బ్యాండ్లు ధరించి బరిలోకి దిగారు. ఈ విషయాన్ని బీసీసీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. వయసు సంబంధిత కారణాలతో శివాల్కర్ ఈ మధ్యే తనువు చాలించిన సంగతి తెలిసిందే. ముంబై తరఫున 124 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లాడిన లెఫ్టార్మ్ స్పిన్నర్ శివాల్కర్ 589 వికెట్లు పడగొట్టాడు.

చిత్రం



# బలమైన భావోద్వేగాల ఎల్లమ్మ?

'బలగం'తో తెలంగాణ మూలాలను, సంస్కృతిని స్పృశించాడు దర్శకుడు వేణు యెల్దండి. కొందరు ఆ సినిమాను కల్ట్ క్లాసిక్ అంటే.. ఇంకొందరు అనుకోకుండా జరిగిన అద్భుతంగా అభివర్ణించారు. అంతటి విజయం తర్వాత దర్శకునిగా అతనిపై భారం మరింత పెరగడం కామన్. ఈ నేపథ్యంలో ఆయన 'ఎల్లమ్మ' కథ రాశాడు. దిల్‌రాజే ఈ సినిమాను కూడా నిర్మించేందుకు ముందుకొచ్చారు. నితిన్ హీరోగా ఖరారయ్యాడు. అసలు ఏంటి ఈ 'ఎల్లమ్మ'? అనే విషయానికొస్తే.. ఇదో గ్రామదేవత చుట్టూ తిరిగే కథ అని తెలుస్తున్నది. పైగా ఆ దేవతకూ ఇందులోని కథానాయిక పాత్రకూ బలమైన బంధం ఉంటుందట. పైగా కథానాయిక పాత్ర అత్యంత శక్తిమంతంగా ఉండటమే కాక, ఆ పాత్ర చుట్టూ బలమైన భావోద్వేగాలు కూడా అల్లుకొని ఉంటాయని సమాచారం. అందుకే ఆ పాత్ర కోసం సాయిపల్లవిని తీసుకోవాలని గట్టిగా ప్రయత్నిస్తున్నారట దర్శకనిర్మాతలు. త్వరలోనే 'ఎల్లమ్మ' కథను సాయిపల్లవి వినబోతున్నదని వినికిడి. తను ఓకే చెప్పిందంటే.. సినిమా సగం విజయం సాధించినట్టేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. సాయిమాధవ్ బుర్రా ఈ సినిమాకు మాటలు రాయనున్నారట.



# తాతామనవళ్ల జాతర

సరైన మాస్ క్యారెక్టర్ పడిందంటే చెలరేగిపోవడం రవితేజకు పరిపాటే. రెండేళ్ల క్రితం 'ధమాకా'తో బాక్సాఫీస్ దగ్గర ఆయన చేసిన హంగామా అంతా ఇంతా కాదు. ఆ సినిమాతో వందకోట్ల విజయాన్ని అందుకున్నారాయన. ప్రస్తుతం అదే తరహాలో ఆయన చేస్తున్న సినిమా 'మాస్ జాతర'. రచయిత భాను భోగవరపు దర్శకునిగా పరిచయం అవుతున్నారు. సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న విడుదల కానున్నట్టు సమాచారం. ఇదిలావుంటే.. రవితేజ, డా.రాజేంద్రప్రసాద్ ఇందులో తాతామనవళ్లుగా నటిస్తున్నారని తెలిసింది. వారి కాంబినేషన్ సీన్స్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయని, థియేటర్లన్నీ నవ్వులతో మారుమోగిపోతాయని చిత్రబృందం చెబుతున్నది. మరో విషయం ఏంటంటే.. ఈ సినిమాలో రవితేజ మెమరబుల్ బ్లాక్‌బస్టర్ 'ఇడియట్'లోని 'చూపుల్తో గుచ్చి గుచ్చి చంపకే..' పాటని రీమిక్స్ చేస్తున్నారట. రవితేజ, శ్రీలీలపై ఈ పాట ఉంటుందట. మరి ప్రయత్నంలో అటు మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసిరోలియో, ఇటు డైరెక్టర్ భాను భోగవరపు ఏ మాత్రం సక్సెస్ అవుతారో చూడాలి.

# 92 సెంటర్లలో 50రోజులు



అగ్ర కథానాయకుడు వెంకటేశ్ తాజా బ్లాక్‌బస్టర్ 'సంక్రాంతికి వస్తున్నాం' టాలీవుడ్ రీజనల్ సినిమాల్లో రికార్డు సృష్టించింది. 300కోట్లకు పైగా వసూళ్లను రాబట్టడమే కాక, రీసెంట్‌గా ఓటీటీలో విడుదలై ఇతర బ్లాక్‌బస్టర్‌ల వ్యూవర్‌షిప్‌ని అధిగమించి, దూసుకుపోతున్నది. ఓటీటీ ప్లాట్‌ఫార్మ్‌ల ఆధిపత్యం కారణంగా థియేటర్లలో సినిమాలు లాంగ్‌రన్ లేకుండా పోతున్న నేటి రోజుల్లో ఏకంగా 92 సెంటర్లలో 50రోజులు పూర్తి చేసుకుని అరుదైన రికార్డును కూడా సొంతం చేసుకుంది. అనిల్‌రావిపూడి దర్శకత్వంలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మించిన విషయం తెలిసిందే.

# వందకోట్ల సినిమా అవుతుంది



''రాబిన్‌హుడ్' చేశాక నటునిగా నామీద నాకు కాన్ఫిడెన్స్ రెట్టింపయ్యింది. సినిమా చూశాక నేను హీరోగా చేసిన రోజులు గుర్తొచ్చాయి. అలాగే ఆడియన్స్‌కి కూడా గుర్తొస్తాయి. చాలా ఎంటర్‌టైన్మెంట్‌గా ఉంటుందీ సినిమా' అని నటకిరీటి డా.రాజేంద్రప్రసాద్ అన్నారు. నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రాబిన్‌హుడ్'. మైత్రీమూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న రాజేంద్రప్రసాద్ మంగళవారం విలేకరులతో ముచ్చటించారు. 'ఇందులో దేశంలోనే అత్యున్నతమైన సెక్యూరిటీ ఏజెన్సీకి నేను అధినేతను. నా ఏజెన్సీలో పనిచేసేందుకు హీరో వస్తాడు. మా కాంబినేషన్ సీన్స్ అద్భుతంగా ఉంటాయి. నా టైమింగ్‌ని నితిన్ ఫాలో అవ్వాలి. అతని టైమింగ్‌ని నేను ఫాలో అవ్వాలి. క్యారెక్టర్లు ఇలా డిజైన్ చేయబడ్డాయి. మా మధ్య వెన్నెల కిశోర్. సినిమా భలే గమ్మత్తుగా ఉంటుంది. ఇలాంటి ఎంటర్‌టైన్మెంట్ మూవీ చేసి నిజంగా చాలాకాలమైంది. ఈ మధ్యకాలం వందకోట్ల వసూళ్లు దాటిన సినిమాలు చాలా చేశాను. వాటి సరసన 'రాబిన్‌హుడ్' కూడా చేరుతుంది' అని నమ్మకం వ్యక్తం చేశారు.

# ప్రతీ సీన్ గుర్తుంది!



అగ్ర కథానాయిక సమంత సినీ రంగంలో పదిహేనేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకుంది. 'ఏమాయ చేసావె' చిత్రంతో ఆమె వెండితెరకు పరిచయమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది సమంత. ఈ జర్నీలో ఎన్నో ఎత్తుపల్లాలను చూశానని, అయినా ఏ రోజూ అధైర్యపడలేదని, జీవితంలోని ప్రతీ దశను ఆస్వాదించానని చెప్పింది. 'అప్పుడే 15ఏళ్లు గడచిపోయాయంటే నమ్మశక్యంగా లేదు. నా జీవితంలో సక్సెస్, ఫెయిల్యూర్స్ అన్నింటినీ చూశాను. కొన్ని సంక్షోభాలను కూడా ఎదుర్కొన్నా. ఇప్పుడు మరింత పరిణితి సాధించాను. జీవితంలో దేనినైనా ఎదుర్కోగలననే నమ్మకం ఏర్పడింది' అని సమంతా తెలిపింది. తన తొలి చిత్రం 'ఏ మాయ చేసావె' గురించి మాట్లాడుతూ 'ఆ సినిమాలోని ప్రతీ సీన్ ఇప్పటికీ నాకు గుర్తుంది. కార్తీక్‌ను గేటు దగ్గర కలిసే సీన్‌ను ఫస్ట్‌షాట్‌గా తీశారు. దర్శకుడు గౌతమ్‌మీనన్‌తో పనిచేయడం ఓ అద్భుతమైన అనుభూతి. నా కెరీర్‌లో బెస్ట్ చిత్రాల్లో 'ఏ మాయ చేసావె' ముందు వరుసలో ఉంటుంది' అని సమంత ఆనందం వ్యక్తం చేసింది.

# సూపర్ నాచురల్ కాన్సెప్ట్



రోషన్, కార్తికేయదేవ్, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోదాటి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'టుక్ టుక్'. సుప్రీత్ కృష్ణ దర్శకుడు. ఈ నెల 21న విడుదలకానుంది. మంగళవారం టీజర్‌ను విడుదల చేశారు. సూపర్ నాచురల్ ఎలిమెంట్స్‌తో సాగే వినోదాత్మక చిత్రమని, ముగ్గురు యువకుల జీవిత ప్రయాణం నేపథ్యంలో సాగుతుందని, థియేటర్‌లో ఎక్స్‌పీరియన్స్ చేయాల్సిన చిత్రమిదని దర్శకుడు తెలిపారు. ఫాంటసీ అంశాలతో రూపొందిన ఈ ప్రేమకథా చిత్రంలో ఎన్నో సర్‌ప్రైజ్‌లుంటాయని నిర్మాతలు పేర్కొన్నారు. విభిన్న కథా చిత్రంలో నటించడం ఆనందంగా ఉందని చిత్ర తారాగణం తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సంతు ఓంకార్, నిర్మాతలు: రాహుల్ రెడ్డి, శ్రీవరుణ్, శ్రీరాముల రెడ్డి, సుప్రీత్ కృష్ణ, దర్శకుడు: సుప్రీత్‌కృష్ణ.

# హైదరాబాద్‌కి షిఫ్ట్ అయ్యా!



'నా ప్రతి పుట్టినరోజుకీ నావంతు సాయంగా సోషల్ సర్వీస్ చేయడం అలవాటు. చెన్నై నుంచి మొత్తంగా హైదరాబాద్ షిఫ్ట్ అయ్యాను. అందుకే.. ఇకనుంచి హైదరాబాద్‌లో నా సేవాకార్యక్రమాలు కొనసాగుతాయి.' అని వరలక్ష్మీశరత్‌కుమార్ అన్నారు. మార్చి 5న(నేడు) ఆమె పుట్టినరోజు. ఈ సందర్భంగా తన భర్త నికోలయ్ సచ్‌దేవ్‌తో కలిసి హైదరాబాద్‌లోని లెప్రా సొసైటీ అనాథ శరణాలయానికి వెళ్లి అక్కడి చిన్నారులతో సమయాన్ని గడిపి, వారికి బహుమతుల్ని అందజేశారు వరలక్ష్మి శరత్‌కుమార్. అనంతరం తన భర్తతో కలిసి శరణాలయానికి డొనేషన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె ఇంకా మాట్లాడుతూ 'చాలామందికి ఈ అనాథ శరణాలయం గురించి తెలీదు. మాలాంటి సెలబ్రిటీలు ఇక్కడకి రావడం వల్ల ఈ ఆర్ఫనేజ్‌కు గుర్తింపు వస్తుంది. తద్వారా జనాలకు తెలుస్తుందనే ఉద్దేశ్యంతో ఈ రోజు ఇక్కడకు వచ్చాం. ఈ ఆర్ఫనేజ్‌లో చాలామంది ఆడబిడ్డలు ఉన్నారు. ఒక్క ఈ బ్రాంచ్‌లోనే 62మంది చిన్నారులున్నారు. దయచేసి అందరం హెల్పింగ్ హ్యాండ్స్ అందిద్దాం. కుదిరినప్పుడల్లా ఈ చిన్నారులను కలుద్దాం. మనం చేసే చిన్న సాయం కూడా వీరికి గొప్ప సంతోషాన్నిస్తుంది' అన్నారు వరలక్ష్మి. మనకున్నదాంట్లో సాయం చేస్తే.. ఈ ప్రపంచం మళ్లీ మనకు సాయపడుతుందని వరలక్ష్మి శరత్‌కుమార్ భర్త నికోలయ్ సచ్‌దేవ్ తెలిపారు.

# ఇప్పటివరకు రాని కాన్సెప్ట్

నటీనటుల ముఖాలు కనిపించకుండా కేవలం కథ, కథనాల మీద సినిమాను నడిపిస్తూ ఓ వైవిధ్యమైన ప్రయోగంతో తెరకెక్కిస్తున్న చిత్రం 'రా రాజా'. బి.శివప్రసాద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీపద్మిని సినిమాస్ సంస్థ నిర్మించింది. ఈ నెల 7న విడుదలకానుంది. మంగళవారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందించే ప్రయోగాత్మక చిత్రమని దర్శకుడు తెలిపారు. ఇప్పటి వరకు తెలుగులో రాని కాన్సెప్ట్ ఇదని సంగీత దర్శకుడు శేఖర్‌చంద్ర పేర్కొన్నారు.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.